# అద్దె కొంప

రచన :
శ్రీ ఏ. ఎస్. రామారావు

ఈ వూళ్లో అద్దెకొంపలు అసలే కరువై పోయేయి. అంటే అద్దెకివ్వటానికి అసలు కొంపలు లేవని కాదు! కొంపలు బహుసంఖ్యల్లో వున్నాయి. కాని, నాబోటి బ్రహ్మచారి బడుద్ధాయికి కొంప అద్దెకిచ్చేనాథుడు కరువై పోయేడని!

ఈ ప్రభుత్వాదికారులు మరీని! గతిలేని గుమస్తాల్ని ఒకపట్టాన తిన్నగా బ్రతకనీయరు. ఏవో కొంపలుమునిగి పోయినట్టూ; మిన్నువిరిగి మీద పడ్డట్టూ ఈ గుమస్తారాయుళ్లని ఒకచోటునుంచి మరొక చోటుకి బదిలీచేస్తుంటారు. పట్నముకాక, పల్లేకాక ఆమూలు వూళ్లో ప్రపంచంతో సంబంధంలేకుండా ఫైళ్లచాటున కూర్చున్న నన్ను, వున్నట్టుండి ఒక్కసారిగా ఈ పట్నంలోకి గిరవాటేసేరు. కొద్దిపాటి అద్దెలో పెద్దకొంప సంపాయించుకున్న నేను నిక్షేపంగా కాలక్షేపం చేస్తూంటే ఓర్వలేని 'విధి' ప్రభుత్వరూపంలోవచ్చి హుజూరు ఆఫీసుకు ట్రాన్స్ఫర్ చేస్తూన్నట్టు ఆర్డరు జారీచేసి పడేసింది. ఏం చేయను? 'విధి'ని తిట్టుకుంటూ పట్నంచేరకతప్పింది కాదు. లేకపోతే దొరక్క దొరక్క వచ్చిన ఈ వుద్యోగానికి తిలోధకాలు ఇవ్వాల్సిందే!

పట్నం చేరాక మొదటివారం రోజులూ ఆఫీసునే సత్రం చేసుకున్నా. ఎన్నాళ్లని హోటల్లో తింటూ, ఆఫీసులో కాలం గడుపుతాను! పైగా చేతికందిన జీతపురాళ్లన్నీ అయ్యరు దోసిళ్లలో పోస్తే, నామీద ఆధారపడ్డ వాళ్ల గతేంకాను? గత్యంతరంలేక, చిన్ననాటి స్నేహితుడూ, తోటి గుమస్తా అయిన అప్పారావుని ఆసరాగా తీసుకొని అద్దెకొంప అన్వేషణార్థం బయల్దేరేను.

ఇళ్లను వెదికినపుడు నన్నెదుర్కొన్న పరిస్థితులు ఉద్యోగాన్వేషణలోకూడా ఎదుర్కోలేదు. ఉద్యోగం కోసం సర్వీసుకమీషనువాళ్లు, తదితరమైన ఆఫీసర్లు వేసిన ప్రశ్నలు నాకట్టే కష్టాన్ని, చికాకుల్ని కల్గించకపోగా, ఈనాడు అద్దెకు ఇల్లు ఇవ్వదల్చుకున్నవాళ్లు వేసినప్రశ్నలు కష్టాన్ని కల్గించటమేకాకుండా నా పరువునీ, ప్రతిష్టనీ, మట్టికలుపుతున్నట్లు బాధపడవల్సివచ్చేది. కాకపోతే ఏమిటిది? నా కులం, వివాహ విషయం, అలవాట్లతో వాళ్లకేమిటి సంబంధం చెప్పండి? అద్దెకు యిల్లు ఇవ్వటానేక, పుచ్చుకున్నవాడికి పెళ్లి కావటానికీ ముడి వేయటం ఎందుకు?

ఏది ఎలావున్నా; అవసరం నాది కనుక, ఎంతకష్టమనిపించినా. ప్రతీ చిన్నప్రశ్నకూ ఓర్పుతోనే సమాధానం ఇచ్చేవాణ్ణి. తీరా 'నాకు పెళ్లికాలేదని' చెప్పగానే ఆ పెద్దమనిషి ముఖం కాస్తా ముకుళించుకుపోయేది.

అయినా కొన్నిళ్లు దొరక్కపోలేదు. ఏసదుపాయములేని యిళ్లు కాస్త చవకలోనే దొరికేవి. అలాంటిళ్లలో నివసించేకంటే, ఊరికే ఏ చెట్టుక్రిందనో కాపరం పెట్టుకుంటే నయమనిపించేది. ఒకవేళ తీరా అలాంటిళ్లలో దిగామంటే, అనంతరం ఆసుపత్రికి సిమెంటురస్తా వేసుకోవల్సివస్తుంది. పోనీ అన్నిసదుపాయాలు వున్న యిల్లు దొరికిందనుకుంటే అద్దెకిస్తే, జీతంలో సగం అద్దెక్రింద పోస్తే, నామీద ఆధారపడ్డ అయిదుగురు బ్రతుకులు ఏలా మోసేది? అందుకనే ఈ ఆశలుకూడా వదులుకున్నాను. నా జీతానికీ, తాహతుకీ సరిపోయిన యిళ్లు దొరికాయన్నమాటేగాని నేను 'అవివాహితుణ్ణి' అనే క్వాలిఫికేషన్‌తో డిస్క్వాలిఫై చేసేరు కొందరు ఘరానా పెద్దలు. ఏమయితేనేం? ఈ పెద్దలంతా కలిసి నాకో యిల్లంటూ అద్దెకివ్వకుండా చేసారు.

ఒక్కవారంరోజుల్లో క్రొత్తగా కొన్న బాటాచెప్పులు అరిగిపోయేయి. నాకు యిల్లు సంపాయించిపెట్టడంలో అప్పారావుకి విసుగుపుట్టిందేమో? 'ఒరే అబ్బీ! నీకొక యిల్లు కావాలంటే తక్షణం ఒక యిల్లాలిని తెచ్చుకో, లేకపోతే యిళ్లకోసం వెతుక్కు. అంతేకాని, నీతో కూడా నన్ను చంపకు' అని నిక్కచ్చితగా చెప్పేశాడు.

నిజం అంతే. నాకంటే అవసరంకాని. మధ్యవాడి కేంపట్టింది. నాతో తిరగటానికి? పైగా అప్పారావు ఈనాటివరకూ నాకోసం తీసుకున్నశ్రమ ఇంతా అంతా కాదు. ఇంకా ఎన్నివీధులని తిరగ్గలడు? వాడికి చికా కనిపించిందంటే ఆశ్చర్యపడాల్సిన అవసరంకలగలేదు. అందుకనే నేను వాణ్ణేం అనకుండా వూరుకున్నా.

నిజం ఆలోచిస్తే నాలాంటివాణ్ణి చూసి సానుభూతి చూపించేవాళ్ళుండకపోరు. పెళ్ళికానంతమాత్రాన ప్రతి మగాణ్ణి పోకిరిరాయుడిక్రింద జమచేయటమే ? ఏ ఒక్క మగాడూ పెళ్లిచేసుకు పెళ్ళాంతోసహా పుట్టలేదుకదా! ఈనాడు 'పెద్దమనుషులం' అనుకుంటున్న ఈ వివాహితులంతా ఒకప్పుడు తామకూడా బ్రహ్మచార్లుగానే జీవించేరుగదా. క్రిందికెవరో మహానుభావుడు 'తనని తానే నమ్మనివాడు ఎదుటివాళ్లని అసలే నమ్మడు' అన్నాట్ట. తాము బ్రహ్మచార్లుగా వున్నప్పుడు పోకిరీ వేషాలు వేయకపోతే, నాబోటివాణ్ణిచూసి ఇలాంటి అనుమానం ఎందుకు కలగాలి? ఇదేమైనా సమంజసంగా వుందా చెప్పండి ?

పోనీ ఇంతెందుకు ? కాలేజిలో నా చదువు పూర్తవగానే, కాలేజివాళ్ళూ; ఉద్యోగంకోసం ఇతరత్రా పెద్దల దగ్గర్నుంచి సంపాయించిన కొండంత సర్టిఫికెట్లు చూపిస్తానన్నా నమ్మరే ? మరయితే నాబోటివాళ్ళగతేంకాను :

పోనీ, ఇంతవయసొచ్చి, వుద్యోగంచేస్తూ ఎందుకింకా పెళ్లికాలేదో చెప్పుకుందామన్నా వినేనాథుడుకూడా లేడు. పెళ్లంటే ఇష్టంలేనివాళ్లు ఈరోజుల్లో ఆడపిల్లల్లో కాని, మగరాయుళ్లలో కాని వున్నారంటే ఎవరైనా నమ్ముతారా ? ముఖ్యంగా ఈరోజుల్లో మిడిమిడి జ్ఞానంవున్న కుర్రకుంకలు ఆడేఆటలు పెళ్లిళ్ల ఆటలే. పైగా 'ప్రేమాయణాలకు' వ్యాఖ్యానకర్తలు కూడా. పొరపాటున నూటికి, కోటికి ఒక్కరుంటే అలాంటివాళ్లు బాల సన్యాసయ్యలూ, బాల సన్యాసమ్మలూను.

గౌరవనీయ కుటుంబంలో పుట్టిన నేను జీవితంలో ఆనందాన్ననుభవింపబోయే రోజుల్లో తండ్రిని పోగొట్టుకున్నాను. పైగా జ్యేష్ఠుణ్ని కావటంచేత, ఉద్యోగం చేస్తూండడంచేత, కుటుంబపోషణ భారం నా నెత్తిన పడింది. తల్లి—పెళ్లికి సిద్ధంగా ఇద్దరు చెల్లెళ్లు—చదువుకుంటున్న ఇద్దరు తమ్ముళ్ళనీ పోషించుకుంటూ, పెళ్లి చేసుకు ఏం బావుకుంటాను ?

ఇల్లాంటి పరిస్థితుల్లో ఏం చేయటానికీ తోచలేదు. ఇంటికోసం ప్రయత్నం విరమించుకున్నాను. నాకోసం ఈవారంరోజులు శ్రమతీసుకొన్న అప్పారావుకు కృతజ్ఞత చెప్పుకుని, అయ్యరునే పోషించదల్చుకోటానికి నిశ్చయించుకున్నాను.

మర్నాడు ఆదివారం కావటంచేత, పార్కునుంచి ఆలస్యంగా ఆఫీసు చేరుకున్నాను. టేబిలుమీద ఫైళ్ళన్నీ ఒకమూలకు నెట్టి బెడ్డింగు పరిచేను. నా అవస్థను తల్చుకుంటూ ఎప్పుడో నిద్రపోయేను.

♦ ♦ ♦

'అదృష్టం పండిందిరా అబ్బే! భళ్లున తెల్లారినా ఇంకా మొద్దునిద్దరేమిటిరా ? లేలే!' అంటూ అప్పారావు వచ్చి లేపేవరకూ తెలివిరాలేదు. అప్పటికప్పుడే ఏడు గంటలైంది.

తొందరగా కాలకృత్యాలు ముగించుకుని, బట్టలు వేసుకున్నాను. నేనూ అప్పారావు కల్సి దేవాలయానికి బయల్దేరేం. అప్పారావుముఖంలో సంతోషరేఖలు చూస్తూంటే నా కెక్కడో ఒక ఇంటిని అప్పారావు సంపాయించేడని వూహించుకున్నాను.

హోటల్లోంచి బయట పడగానే 'ఏంరా అప్పా! ఏమిటి సంగతి?' అడిగాను.

'అబ్బే! ఇల్లు దొరికిందిరా! కాని…….'ఆగిపోయేడు అప్పారావు.

నా గుండెల్లో రాయి పడింది. మళ్ళీ ఏం 'ఆపదవచ్చి పడిందోనని కాని ఏమిట్రా వేగంగా కానీ' అన్నా.

'ఒరే! ఇదుగో చెప్తున్నా. ఆ యింటి యజమాని అడిగే ప్రశ్న లన్నింటికీ నేనే నీతరపున వకాల్తా పుచ్చుకొని జవాబిస్తాను. నువ్వు నోరు కదపటానికి వీల్లేదు. ఒకవేళ నా జవాబులకు నీ సర్టిఫికేషన్ కావాలంటే మారు మాటాడకుండా 'ఔను' అనేయాలి. తెల్సిందా?' ముందుగానే వార్నింగిచ్చేడు.

SUNDAR DIAMOND WORKS
80. BIG CHETTY STREET. TIRUCHIRAPALLI-8

సుందర్ వజ్రములు అందరు వ్యాపారస్థులకు
సరసమైన ధరలో పంపబడును.
ఉంగరాల కలరు వజ్రములు అన్నిరకములలోదొరకును.
ఒకసారి ప్రయత్నించి చూడండి.

సుందర్ డైమండ్ వర్క్స
80. బిగ్‌చెట్టి స్ట్రీట్ తిరుచిరాపల్లి-8

'సరే' నన్నాను ఇద్దరం బయల్దేరేం.

మేం వెళ్ళేసరికి యజమాని రామబ్రహ్మంగారు గుమ్మంలోనే కూర్చొని వున్నారు. చాలా ఆప్యాయంగా ఇద్దరిని లోనికి ఆహ్వానించేరు. అప్పారావు అయనకు నన్ను పరిచయం చేసేడు. ఈ వ్యవహారం అంతా చూస్తూంటే ఇదేదో అప్పారావు ఆడుతున్న నాటకంలా తోచింది. కాని, అప్పారావుకు ముందే వాగ్దానం చెయ్యటంచేత నోరు మూసుకు కూర్చోక తప్పిందికాదు. నా గురించి అప్పారావు చెప్పటం మొదలు పెట్టేడు.

నా భార్యకు అయిదోనెలట, సీమంతానికి పుట్టింటివాళ్ళ తీసుకువెళ్ళేరుట. పురుడు రాగానే మూడోనెలలో తిరిగి పాపాయితో సహా వస్తుందట మా ఆవిడ. పైగా చదువుకున్నదనీ, చురుకైనదనీ, అన్ని గృహకృత్యాల్లోనూ అసమానమైన నైపుణ్యం గలదనీ, పరమభాగవతోత్తమురాలనీ, వగైరా, వగైరా కోసేయటం మొదలెట్టేడు.

అప్పారావు నోటికి వచ్చినట్టు చెప్పేస్తుంటే నా పరిస్థితి ఎలావుంటుందో వేరే చెప్పక్కరలేదు; నేను చాలా మొహమాటస్తుణ్ణినీ, సౌమ్యుణ్ణనీ, అలంకారప్రాయంగా చెప్పేడు. ఇల్లు దొరగ్గానే తల్లినీ, తోబుట్టువుల్నీ తీసుకు రావటానికి సిద్దంగా వున్నానన్నాడు.

అప్పారావు నా గురించి మొదట చెప్పినమాటలు ఎంత అసందర్భంగా వున్నాయో, మిగతావి అంత సందర్భంగానూ వున్నాయి. పాపం, రామబ్రహ్మంగారు అప్పారావు చెప్పినమాటలన్నీ నమ్మేశారు. ఆయన అమాయకత్వంచూసి నాకు జాలి కలిగింది. నిజం చెప్పేద్దామనుకున్నాను. కాని, నా అవసరం అలాంటిది కావటంచేత, పైగా బ్రహ్మచారిని కావటంచేత, నా ప్రయత్నం విరమించుకోక తప్పిందికాదు.

అనంతరం ఆయన గొడవ చెప్పుకోవటం మొదలెట్టేడు. ఒక్కగా నొక్క కూతురు పెళ్ళికి సిద్ధంగా

కూర్చోని వుందనీ, కట్నాలకోసం డబ్బు పొయ్యలేక ఇంట్లోనే పెంచుతున్నాననీ బాధపడుతూ చెప్పేడు. బ్రహ్మచార్లకీ, స్టూడెంట్సుకీ ఇస్తే చాలా రసాభాసవుతుం దనే భయంతో ఇంతవరకు ఇంటిని అద్దెకివ్వటం జరగ లేదని ఏమేమో చెప్పుతున్నాడు. ఎలా అయితేనేం ఇరవై రూపాయలకు అద్దె కుదుర్చుకుని తాళాలు తీసుకున్నాం రామబ్రహ్మంగారిదగ్గర సెలవు తీసుకుని బయల్దేరేం. రోడ్డుమీద చేరాక, ఏదోవిధంగా నాకొకయింటిని సంపా యించిపెట్టిన అప్పారావుని హృదయపూర్వకంగా అభి నందించాను.

మంచిరోజుచూసి నా బసను ఆఫీసునుంచి క్రొత్త ఇంట్లోకి మార్చేను. చేరిన కొద్దిరోజుల్లోనే ఆయనకూ, నాకూ పరిచయం దృఢమైపోయింది. ఆయనెప్పుడూ నా భార్య గురించి, పుట్టబోయే బిడ్డ గురించి, ఏవేవో సర దాగా చెప్తూండేవారు. ఆయన మాటలకు నాకు నవ్వు వస్తూన్నా, నిజం తెలిస్తే వీపు విమానం మ్రోత మ్రోగి పోతుందనే భయంకూడా లేకపోలేదు. ఏనాటికైనా నిజం దాగదుగదా? అ భయంతోనే రోజులు భారంగా ఈడ్చే వాడిని.

♦ ♦ ♦

ఉన్నట్టుండి రామబ్రహ్మంగారు బావమరిది అవతారం గారు వూరినుంచి వచ్చేరు. ఆయన రావటం కాదు కానీ, రామబ్రహ్మంగారు మహా ఉగ్రుడై పోయేరు. చరచరా నా గదిలోకివచ్చి వెంటనే ఇల్లు ఖాళీ చేసేయమని ఆర్డరు జారీ చేసేరు. కొంపతీసి నా రహస్యం కాస్తా తెలిసి పోయిందేమోనని గాభరాపడ్డాను. 'ఏందారి భగవంతుడా!' అనుకున్నాను.

రామబ్రహ్మంగారు పదేపదే అడగటంతో 'ఇంకా నెల పూర్తి కాలేదు కదుటండీ నెలాఖరుకు ఖాళీ చేస్తాను' అని జవాబు చెప్పక తప్పలేదు.

అయినా సరే ఆయన ఒప్పుకోలేదు. వెంటనే వెళ్ళిపో మన్నాడు. నాకేం చెయ్యటానికీ తోచలేదు. మౌనం దాల్చేను.

'మీకు పెళ్ళయిందా!' కోపంగానే అడిగారు రామ బ్రహ్మంగారు.

'ఊఁ! అయింది' అన్నాను ముక్తసరిగా.

'ఎన్నాళ్ళయింది? ఎవరిపిల్ల? తిరిగి ప్రశ్న వేశాడు.

ఏమని జవాబు చెప్పటం? వళ్ళు ముచ్చెమటలు పోసేయి. గుండె సడన్‌గా ఆగినంతపనయింది. ఆయన ప్రశ్నలకు వెంటనే జవాబు చెప్పేస్థితిలో లేను. అలాంటి పరిస్థితి ఏర్పడుతుందని, అదైనా ఇంత త్వరలో జరుగు తుందని ఆశించలేదు.

ఇంతలో అవతారంగారు రంగంలోకి దూకేరు, బావ గార్ని సర్దుతూ 'పాపం పెళ్ళికాలేదుకదూ! అంచేత ఇల్లు అద్దెకివ్వరేమోనని ఆబద్ధమాడి వుంటాడు. అంతే కదూ అబ్బాయి?' సూటిగా నాకే వేశాడు ప్రశ్న.

జవాబు చెప్పేస్థితిలోలేని నేను 'మౌనం అర్ధాంగి కారం' అన్నట్లు చూస్తూ నిల్చుండి పోయేను.

'బావగారూ! ఈయన మనవాడే! మనమ్మాయికి ఈడైనవాడు కూడానూ, ఇద్దరికీ ముడి వేస్తే అయనికి యిల్లూ వుంటుంది, నీకు అల్లుడూ వస్తాడు' రాజీ మార్గా న్ని సూచిస్తూన్నట్లుగా అన్నాడు.

ఆసమయంలో నాకు మెడకాయమీద తలకాయ తీసేసి నట్లనిపించింది. ఏంచెయ్యటానికీ తోచక కొయ్యబారి పోయేను. సమయానికేవచ్చిన అప్పారావునిమాసి కాస్త ధైర్యం తెచ్చుకున్నాను,

అప్పారావు అవతారంగారిని సంగతేమిటని అడగ టంతో అవతారంగారు చెప్పటం మొదలెట్టారు.

'రామబ్రహ్మంగారి అమ్మాయికి సంబంధాన్ని వెతు కుతూ ఆయన మా తల్లిగారిని కల్సుకున్నాడట. అన్ని విషయాలూ ఆయనా, మా అమ్మగారూ మాట్లాడుకుని ఒక వప్పందానికి వచ్చేరట. ఇక మిగిలిందల్లా, అబ్బాయి, అమ్మాయి, ఒకర్నొకరు చూసుకొని నచ్చుకోవటమే. ఈ వూళ్ళోనే నౌఖరీ చేస్తూన్నానని తెలుసుకొని తీరా వస్తే, పెళ్ళయిందని అబద్ధాలాడి, కోటలోనే చేరి వుండటం అతనికి ఆశ్చర్యం కల్గించిందట, నేను తమకు నచ్చేనని, నాకు అమ్మాయి నచ్చిందో, లేదో తెల్సుకో వల్సిందిగా అప్పారావుని మధ్యవర్తిత్వం వహించాల్సిం దిగా ప్రార్థిస్తూ' అసలుకథ బైటపడేశాడు.

'ఏరా ఆబ్బే! వింటున్నావా? ఏమంటావూ? తన బాధ్యతను వదల్చుకుంటూ అడిగాడు అప్పారావు.

నా కెన్నడూలేనంతసిగ్గు పుట్టుకొచ్చింది. చిన్నగా నవ్వి వూరుకున్నాను.

'అయితే ఇంకేం? కోటలోనే పెళావ్ పాగా' ఎగతాళిచేస్తూ అన్నాడు అప్పారావు.

'శుభస్యశీఘ్రం!' అంటూ దీవించారు అవతారం.

'కుర్రాళ్ళిద్దరూ గొప్ప నాటకం ఆడి ఘటికులనిపించుకున్నారు. మొత్తంమీద' అన్నారు రామబ్రహ్మంగారు.

'మీరేం తక్కువ తినలేదుగా!' అన్నాడు అప్పారావు.

'ఏమైనా అల్లుడు గట్టివాడేనయ్యో?' బావగారిని హెచ్చరిస్తూ హాస్యానికి అన్నారు అవతారంగారు.

'మావగారేనేమిటి తీసిపోయేరు! అనుకోకుండా అనేశాను.

'కిచకిచ నవ్వులు గలగల గాజుల శబ్ధం కిటికీలోంచి వినిపించాయి. ఆందరి దృష్టులు అటుపడ్డాయి.

అంతవరకూ మా సంభాషణ వింటున్న పెళ్లికూతురు కిచకిచ నవ్వుకుంటూ, సిగ్గుతో తలవంచి, చిలుకలా తుర్రున ఇంట్లోకి పారిపోయింది!

## గృహిణులకు సలహాలు

* వేడినీటి సంచిలో చిటికెడు ఉప్పువేస్తే. సంచిలోని నీళ్లు చాలాసేపు వెచ్చగా వుంటాయి.
* రేయన్ సిల్కుతో తయారు చెయ్యబడిన గుడ్డలను ఇస్త్రీ చేసేటప్పుడు, నీళ్లు చల్లకపోతే వాటిమీద మచ్చలు పడతాయి.
* మీ పాదరక్షలు నీళ్లకు తడిసి, దెబ్బ తినకుండా వుండాలంటే వాటి పైభాగాన్ని ఎల్లగిసె నూనెలో ఒక గుడ్డ పేలికను తడిపి. ఒక్కసారి రుద్దితే చాలు. అడుగులకు 10 గ్రానూల పారఫైన్. 10 గ్రాముల ఎల్లగిసెనూనె కలిపిన ద్రావణపు పూతపూసినట్టయితే అవి దెబ్బతినవు,
* పిండిని దేనినైనా నీళ్లతో గానీ, పాలతో గానీ తడపదలచుకొంటే మీరు కాసిని నీళ్లను గానీ, పాలను గానీ పిండిలో పోసి తడిపితే అది బాగా కలిసిపోతుంది. నీళ్లలో గానీ, పాలలో గానీ పిండిని వెయ్యకూడదు.
* గదినిండా పొగాకు సిగరెట్లు, చుట్టల పొగ అలముకొని వున్నట్టయితే, గాలి ఆడనప్పుడు. గది నడుమ ఒక స్పాంజిని పెడితే అదే ఆ పొగనందటినీ పీల్చేస్తుంది.


మీ ఆభరణములకు
అతి శ్రేష్ఠమయినది
REGISTERED-TRADE-MARK
No:115228
సవరన్ మార్కు
పారిస్ వజ్రములు
వివరములకు
PARIS DIAMOND WORKS
207.D.BIG BAZAR
TIRUCHIRAPALLI—8
పారిస్ డైమండ్ వర్క్సు
207.డి.బిగ్ బజారు
తిరుచురాపల్లి—8